సాక్షి
చిత్తూరు
ఆదివారం । 7 । జనవరి । 2024



ఉగ్రాతలూగించిన సంక్రాంతి సంబరాలు

డైట్ కళాశాలలో శనివారం ఛాత్రోపాధ్యాయులే సంక్రాంతి ముందస్తు సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. - 8లో



ఎన్నికల నిర్వహణలో మీ పాత్రే కీలకం

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం అని డీఆర్ఓ అన్నారు. - 8లో



దేశంలోనే బెస్ట్ సీఎం జగనన్న

దేశంలోనే బెస్ట్ సీఎం జగనన్న అని ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీ రెడ్డెప్ప కొనియాడారు. - 8లో

న్యూస్‌రీల్

కొత్తగా 3,998 బియ్యం కార్డులు

చిత్తూరు రూరల్: జిల్లాకు కొత్తగా 3,998 రైస్ కార్డులు మంజూరయ్యారని డీఎస్ఓ శంకరన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల కాలంలో బియ్యంకార్డుకు దరఖాస్తు చేసుకున్న వారికి అర్హత ఆధారంగా కార్డులు మంజూరైనట్లు చెప్పారు. వీటికి ఈనెల నుంచి రేషన్ పంపిణీ చేయడం జరుగుతుందని, దరఖాస్తుదారులు ఈవిషయాన్ని గమనించి సచివాలయాల్లో కార్డులు పొందాలని ఆయన సూచించారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థినికి పరీక్ష సామగ్రి అందజేస్తున్న డీడీ రాజ్యలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. పాల్గొన్న డీడీ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్రప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని చెప్పారు. అనంతరం ఇంగ్లిష్, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టుల నిష్ణాతులతో విద్యార్థులు ప్రేరణ తరగతులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ నాగేశ్వరరావు, హెచ్‌డబ్ల్యూఓలు శ్రీకాంత్, ఏకాంబరం, మురళి, సులోచన, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో విజయవాడకు కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడలో ఈ నెల 9, 10 తేదీల్లో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించే సమీక్షకు కలెక్టర్ షణ్మోహన్ హాజరు కానున్నారు. త్వరలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో చేపట్టిన ఏర్పాట్ల నివేదికలను సిద్ధం చేయడంలో కలెక్టరేట్ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ సమీక్షకు జిల్లా నుంచి కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి వెళ్లనున్నారు.



నీకా.. నాకా?

పేరుకు సొంత జిల్లా అయినా చంద్రబాబుకు ఏనాడూ ప్రజల మద్దతు దక్కలేదు.. పొత్తుల పేరుతో ఇతర పార్టీలతో కలిసి వచ్చినా ఆశించిన ఫలితాలు రాలేదు.. అవకాశవాద రాజకీయాలతో గెలుపొందాలని యత్నించినా ప్రయోజనం చేకూరలేదు.. మళ్లీ పాత కథే పునరావృతమయ్యే పరిస్థితి కనిపిస్తుండడంతో టీడీపీ అధినేతకు దిక్కుతోచడం లేదు. అసలే బలమైన అభ్యర్థులు లేక ఆందోళన చెందుతున్న బాబుగారికి భవిష్యత్‌పై బెంగ పట్టుకుంది. ఎలాగైనా విజయావకాశాలు మెరుగుపరుచుకోవాలనే దురాలోచన చేస్తున్నట్లు తమ్ముళ్లే చెవులు కొరుక్కుంటున్నారు. చివరకు టీడీపీ.. జనసేన నేతల మధ్య చిచ్చుపెట్టి వేడుక చూస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ వర్సెస్ జనసేన

- బలమైన అభ్యర్థులు లేకపోయినా పోటాపోటీ
- తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి సీట్లపై గందరగోళం
- రెండు పార్టీల నేతల మధ్య చిచ్చుపెట్టి వేడుక చూస్తున్న అధినేతలు
- హైప్ తెచ్చేందుకు ఉత్తుత్తి చేరికలతో హడావుడి
- కనిపించిన వారికి పచ్చ కండువాలు కప్పేస్తూ..
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారంటూ విషప్రచారం

సాక్షి, తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో సరైన అభ్యర్థులు లేకపోవడంతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. చివరకు టీడీపీ, జనసేన పార్టీ నేతల మధ్య ఘర్షణ వాతావరణం కల్పిస్తున్నారు. కీలకమైన తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి అసెంబ్లీ స్థానాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. పొత్తులో భాగంగా పై మూడు స్థానాలను జనసేన కోరకుంటున్నట్లు జరుగుతున్న ప్రచారం తెలిసిందే. తన నైజానికి తగ్గట్టు చంద్రబాబు ఆయా స్థానాలను జనసేనకు కేటాయిస్తున్నట్లు హామీ ఇచ్చినా, వీటిని వదులు కోవడానికి సిద్ధంగా లేరు. ఎలాగైనా ఈ స్థానాల్లో కూడా తమ అభ్యర్థులనే బరిలోకి దింపాలని టీడీపీ అంతర్గత సమావేశంలో నిర్ణయించుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు జనసేన కండువా కప్పించి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దింపేందుకు పావులు కదుపుతున్నారు. నేడో, రేపో చేరిక ఉండవచ్చని జోరుగా ప్రచారం సాగుతోంది. జన బలమే కాదు.. పార్టీ కమిటీలకు దిక్కులేని జనసేన నాయకులమని చెప్పుకునే పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ మాత్రం ఎవరికి వారు తామే అభ్యర్థులమని ప్రకటించుకుంటున్నారు. ఇరువురి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నా పైకి మాత్రం భాయ్‌భాయ్ అని కలరింగ్ ఇచ్చుకు తిరుగుతున్నారు. చంద్రబాబు కుప్పం పర్యటనలో జరిగిన జనసేన నేతలతో పరిచయ కార్యక్రమంలో తలెత్తిన వివాదంపై పసుపులేటికి షోకాజ్ నోటీసు ఇవ్వడం వెనుక కిరణ్ రాయల్ హస్తం ఉన్నట్లు తెలిసింది. వీరి మధ్య కోల్డ్ వార్ నడుస్తుండగా.. మరికొందరికి సీటు ఇస్తామని చంద్రబాబు ఆఫర్ ఇచ్చినట్లు ముమ్మర ప్రచారం జరుగుతోంది.

భారంగా 'రా కదలిరా'

అభ్యర్థుల విషయమే తేల్చకుండా.. చంద్రబాబు 'రా కదలి రా' కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. సోషల్ మీడియా, పచ్చ పత్రికలు, ఎల్లో ఛానళ్లలో తప్ప టీడీపీ గురించి పట్టించుకోని జనంలో పార్టీకి హైప్ తెచ్చేందుకే ఎన్నికల ముందు ఈ కార్యక్రమాన్ని తెరపైకి తీసుకొచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. 'రా కదలిరా'ను అట్టహాసంగా చేపట్టాలని టీడీపీ నేతలకు చంద్రబాబు హుకుం జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అది తలకు మించిన భారంగానే ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. చేసేది లేక ఎక్కడికక్కడ కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అధినేత ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నుంచి తమ పార్టీలోకి పెద్ద సంఖ్యలో చేరికలు జరుగుతున్నాయని ప్రజలను నమ్మించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో కంటికి కనిపించిన వారిని పట్టుకువచ్చి పచ్చ కండువా కప్పేస్తున్నారు. వారందరూ వైఎస్సార్‌సీపీ నుంచి వలస వచ్చేస్తున్నారని కలరింగ్ ఇచ్చేస్తున్నారు. అందులో భాగంగానే శనివారం కుప్పం మండలం మల్లనూరు సమీపంలోని టి.సదుమురు, హెచ్.కొట్టాల గ్రామాలకి చెందిన పలువురిని తీసుకెళ్లి టీడీపీ కండువాలు కప్పేసి ఫొటోలకు ఫోజులిప్పించేశారు. తమ్ముళ్ల అవస్థలు పసిగట్టిన ప్రజలు బాహాటంగానే నవ్వుకుంటుండడం కొసమెరుపు.

చిత్తూరులో బాబు చిచ్చు

చిత్తూరులో టీడీపీ జెండా మోసేవారు కరువైన సమయంలో మాజీ మేయర్ కఠారి హేమలత, మరి కొందరు టీడీపీ శ్రేణులు పార్టీ ఉనికిని కాపాడుకుంటూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో అభ్యర్థిత్వం తమకే దక్కుతుందనుకున్న కఠారి హేమలత, బాలాజీ ఆశలపై చంద్రబాబు నీళ్లు చల్లేశారు. కొత్తగా జగన్‌మోహన్ అనే వ్యక్తిని రంగంలోకి దింపారు. కొంత కాలంగా జగన్‌మోహన్ చిత్తూరులోనే ఉంటూ ప్రజలకు రకరకాల బహుమతులు పంపిణీ చేస్తూ ఆకట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. చిత్తూరు టికెట్‌పై ఆశలు పెట్టుకున్న జగన్‌మోహన్‌కు సైతం చంద్రబాబు హ్యాండిచ్చేశారు. తాజాగా డీకే ఆదికేశవులు నాయుడు బంధువులను రంగంలోకి తీసుకువచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. చాలా కాలంగా బెంగళూరుకే పరిమితమైన డీకే కుటుంబీకులు కొద్ది రోజులుగా చిత్తూరు, శ్రీకాళహస్తిలో టీడీపీ శ్రేణులతో మమేకమవుతున్నారు. ఈ క్రమంలోనే డీకే ఆదికేశవులు నాయుడు మనుమరాలు చైతన్యకు జనసేన కండువా కప్పించారు. శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, టీడీపీ దివంగత నేత గురవయ్య నాయుడుకు ఈమె కోడలు. అందుకే శ్రీకాళహస్తి నుంచి జనసేన అభ్యర్థిగా ఆమెను బరిలోకి దింపాలనే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న బొజ్జల సుధీర్‌రెడ్డి అభ్యర్థిగా పనికిరాడని స్థానిక టీడీపీ నేతలు కొందరు చంద్రబాబుకు వెల్లడించినట్లు సమాచారం. అవగాహన రాహిత్యం, అసభ్య పదజాలంతో సుధీర్‌రెడ్డి మాట్లాడిన మాటలు, ప్రవర్తనపై బాబుకు వీడియోలు పంపినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బొజ్జల సుధీర్ అభ్యర్థిగా పనికి రాడనే అభిప్రాయానికి ఆ పార్టీ అధినేత వచ్చినట్లు తమ్ముళ్లు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇక చిత్తూరు విషయానికి వస్తే.. డీకే ఆదికేశవులు నాయుడు కుటుంబంలోని వ్యక్తికే అభ్యర్థిత్వం ఇవ్వాలని భావించిన చంద్రబాబు.. తాజాగా మరో వ్యక్తికి ఫోన్‌చేసి టికెట్ ఆఫర్ చేసినట్లు తెలియడం గమనార్హం.



కుప్పం మండలంలో రెండు గ్రామాల చెందిన వారికి పచ్చ కండువాలు కప్పి ఫోజులిస్తున్న దృశ్యం

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టండి



పింఛన్ల చెక్ అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

కుప్పం: ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు నవరత్నాలలో భాగంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం వారు కుప్పం మున్సిపాలిటీ, కుప్పం రూరల్ పరిధిలో నిర్వహించిన కొత్త పింఛన్లతో పాటు రూ.3 వేలకు పెంచిన పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట తప్పకూడదనే సిద్ధాంతానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి కట్టుబడి ఉంటారన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచి ఇవ్వడం కూడా దేశ చరిత్రలో ఇదే ప్రథమం అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వలంటీర్లు తలుపు తట్టి పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. పాలనా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదే అన్నారు. ఇలాంటి నాయకుణ్ణి మళ్లీ సీఎంగా చేసుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు మన దరి చేరుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్, ఎంపీపీ అశ్విని, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, వన్నెకుల క్షత్రియ చైర్మన్ వనిత, మండల కన్వీనర్ మురుగేష్, మున్సిపల్ వైస్ చైర్మన్లు మునుస్వామి, హఫీజ్, సివిల్ సప్లయ్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీవారి చిద్విలాసం



తిరుచ్చిపై నుంచి భక్తులను కటాక్షిస్తున్న స్వామివారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరి, మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

పండుటాకులకు వైఎస్సార్ పింఛన్ వెలుగులు

- అవ్వతాతల కష్టాలను తెలుసుకుని.. ఇచ్చిన హామీ నెరవేర్చిన సీఎం జగనన్న
- రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఘనత జగనన్నదే
- పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా



నింద్ర: పెన్షన్ అందుకున్న లబ్ధిదారులతో మంత్రి ఆర్‌కే రోజా

నింద్ర: 'మీ కష్టాలను తెలుసుకుని, మీ జీవితాల్లో వెలుగులు నింపడానికి అహర్నిశలు కృషి చేస్తున్న మంచి మనసున్న నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. నింద్ర మండలం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం రూ.3 వేలు పెన్షన్ పెంపు వారోత్సవాల్లో భాగంగా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈరోజు ఏపీలో మాత్రమే పండుటాకులైన అవ్వాతాతలను తమ బిడ్డలు చూడకపోయినా సీఎం జగనన్న ఒక బిడ్డలా, తమ్ముడిలా, సోదరుడిలా అందరినీ ఆదుకుంటున్నారని తెలిపారు. గతంలో చాలా ప్రభుత్వాలను చూశామని, ఎన్నికల్లో గెలిచేందుకు అలివి కాని హామీలిచ్చి, అధికారం చేపట్టాక చంద్రబాబు ప్రజలను ఎలా మోసం చేశారో కూడా అంతా చూశారన్నారు. కానీ జగనన్న మాత్రం మాట ఇస్తే తప్పరని, ముఖ్యమంత్రిగా సంతకం చేసిన మొదటి రోజు నుంచి ఈ రోజు వరకు సంక్షేమ పథకాలు అన్నీ కూడా ప్రజల ఇళ్ల వద్దకే వలంటీర్ల ద్వారా చేరుతున్నాయని తెలిపారు. పెన్షన్ కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పని లేదని, ఎవరికీ లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని, వలంటీరే వచ్చి అర్హత ఉంటే పింఛన్ అందేలా చేస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.2,225 నుంచి పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచారని అన్నారు.

పేదలకు భరోసా..

రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి పని చేసే పేదల జీవితాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారని మంత్రి రోజా తెలిపారు. మీ బిడ్డలను చదివిస్తున్నాడని, మంచి ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసిన ఘనత కూడా జగనన్నకే దక్కిందన్నారు. ప్రజల ఇళ్ల వద్దకే ప్రభుత్వ డాక్టర్లు వచ్చి వైద్యసేవలు చేయడం దేశంలోనే ప్రథమమన్నారు. ఏదైనా జబ్బు చేస్తే ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చన్నారు. మన రాష్ట్రానికి గతంలో చాలామంది ముఖ్యమంత్రులుగా పని చేశారని, కానీ ఎవరైనా సీఎం జగనన్న లాగా మీ ఇళ్ల వద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందించారా ? అని ప్రశ్నించారు. ఈ సంక్షేమం, అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలంతా మరోమారు వైఎస్సార్‌సీపీని ఆదరించాలన్నా రు. మండలంలో 482 మంది పింఛన్ తీసుకుంటున్నారని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, మండల ప్రత్యేకాధికారి సతీష్‌కుమార్, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ భగవతి, కోఆప్షన్ సభ్యులు అనిల్, ఎంపీటీసీ వి జేష్, సర్పంచ్ బాబురెడ్డి, జిల్లా కార్యదర్శి మేరి, కన్వీనర్ వేణురాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, నాయకులు రామచంద్రారెడ్డి, చంద్రబాబు పాల్గొన్నారు.

ధర్మానికీ అధర్మానికీ మధ్యే ఎన్నికలు



కోలాటం వేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం

పాలసముద్రం: రానున్న ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న యుద్ధమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. శనివారం పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో పండుగ వాతావరణంతో జెడ్పీటీసీ సభ్యుడు అన్బగన్, ఎంపీపీ శ్యామల, మండల కన్వీనర్ తులసీయాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అవ్వాతాతలకు పింఛన్ మొత్తాన్ని విడతలవారీగా పెంచుకుంటూ సీఎం జగనన్న రూ.3 వేలు చేసినట్టు వెల్లడించారు. గతంలో డ్వాక్రా రుణాలను రద్దు చేస్తామని చెప్పి మోసం చేసిన చంద్రబాబును మహిళలు ఇంకోసారి నమ్మరని' అని అన్నారు. 600 హామీలతో నాడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో కనీసం ఆరు హామీలను కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గెలుపు కోసం దత్తపుత్రుడు , దుష్టచతుష్టయాన్ని నమ్ముకుంటే, సీఎం జగన్ ప్రజలను మాత్రమే నమ్ముకున్నారని తెలిపారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన కోలాటను బృందంతో కలిసి కోలాటం ఆడి లబ్ధిదారులను ఉత్సాహపరిచారు.

క్లుప్తంగా

రెండు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



కేఎస్ కురవపల్లెలో ధ్వంసం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

రొంపిచెర్ల: వ్యవసాయ పొలాల వద్ద ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని బోడిపాటివారిపల్లె గ్రామ పంచాయతీలోని కె.ఎస్.కురవపల్లె, పుట్టావారిపల్లె గ్రామాల పరిధిలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో రూ.2 లక్షల వరకు నష్టం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైన సంఘటనా స్థలాలను ఎస్‌ఐ కృష్ణయ్య పరిశీలించారు. ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతు మహాసభ పోస్టర్ విడుదల



రైతు మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: రాజమండ్రిలో ఈ నెల 9, 10 తేదీల్లో రాష్ట్ర రైతు మహాసభ వాల్‌పోస్టర్లను ఏపీ రైతు సంఘం నాయకులు శనివారం విడుదల చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న రైతుల మహా ప్రదర్శన, 9, 10వ తేదీల్లో ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా నుంచి రైతులు వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నా, కేంద్ర ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయడం లేదని తెలిపారు. రైతు వ్యతిరేక విధానాలపై మహాసభలో కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, మునిరత్నంనాయుడు, ట్రేడ్ యూనియన్ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్న ఛాత్రోపాధ్యాయులు



భోగిమంటలు వేస్తున్న అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు

ఉర్రూతలూగించిన సంక్రాంతి సంబరాలు

- ముందస్తు సంక్రాంతి సంబరాలతో డైట్‌లో సందడే సందడి
- ఆకట్టుకున్న కోలాటాలు, బోణాలు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో ముందస్తు సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. శనివారం డైట్ కళాశాల ఆవరణలను ఛాత్రోపాధ్యాయులు రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే తెలుగు సంప్రదాయ ప్రకారం బోణం వండారు. షడ్రుచులతో కూడిన వంటకాలు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. డీఈఓ(తిరుపతి) డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ సంబరాల్లో పాల్గొన్నారు. అధ్యాపకులకు, ఛాత్రోపాధ్యాయులకు ప్రసాదాలను పంచిపెట్టారు. భోగిమంటలు వేసి, వాటి చుట్టూ అధ్యాపకులు ఛాత్రోపాధ్యాయులతో కలసి గొబ్బిళ్లు తట్టడం ఆకట్టుకుంది. అనంతరం ఛాత్రోపాధ్యాయుల కోలాటాలు, కర్రాబిళ్ల, కర్రసాము, నాలుగు స్తంభాల ఆట, వైకుంఠపాళి, సోది చెప్పడం ఆకట్టుకున్నాయి. తెలుగుదనం ఉట్టిపడేలా తెలుగు, తమిళం ఛాత్రోపాధ్యాయులు కలసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు విద్యతో పాటు అన్నిరంగాల్లో రాణించాలంటే కార్వేటినగరం డైట్‌లోనే సాధ్యమన్నారు. కార్యక్రమ ముఖ్యఅతిథి విశ్రాంత సీనియర్ అధ్యాపకులు జయరామనాయుడును ప్రిన్సిపల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుబ్రమణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

దేశంలోనే బెస్ట్ సీఎం జగనన్న



బైరెడ్డిపల్లె: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ, ఎంపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: దేశంలోనే రూ.3 వేలు పింఛను ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ అన్నారు. బైరెడ్డిపల్లెలో శనివారం వైఎస్సార్ పింఛన్ల కానుక పంపిణీ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతతో సమానంగా చూస్తారని, అందుకే 99 శాతం పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారన్నారు. గత నాలుగేళ్లుగా టీడీపీ నాయకులు కనుమరుగై ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజల మధ్యకు వస్తున్నారని, వారు చెప్పే మాటలను నమ్మరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ కేశవులు, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, స్పెషల్ ఆఫీసర్ అరుణకుమారి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాదిరేడులో మరో 1,703 మందికి ఇళ్ల పట్టాలు

తిరుపతి(అలిపిరి): వడమాలపేట మండలం పాదిరేడు వద్ద రెండో విడతలో మరో 1,703 మంది టీటీడీ ఉద్యోగులకు 132 ఎకరాల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. శనివారం స్థానిక శ్వేత భవనంలో రెండో విడత ఉద్యోగుల ఇంటి స్థలాల కోసం లక్కీ డిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన మహతి ఆడిటోరియంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారని చెప్పారు. అర్హులైన టీటీడీ ఉద్యోగులందరికీ ఇళ్ల పట్టాలు అందుతాయన్నారు.

త్వరలోనే ఏర్పేడు సమీపంలో మిగిలిన వారికి పట్టాల పంపిణీ జరుగుతుందన్నారు. అనంతరం డిప్ నిర్వహించి టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు, టీటీఈ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ప్లాట్లు పొందిన 1,703 మంది ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.



డిప్ కార్యక్రమంలో టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్, ఉద్యోగులు

ఎన్నికల నిర్వహణలో మీ పాత్రే కీలకం

- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిస్థాయిలో చదవండి
- పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పరిశీలించండి
- సెక్టోరల్ అధికారుల సమావేశంలో డీఆర్ఓ రాజశేఖర్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం అని డీఆర్ఓ రాజశేఖర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్డీఓలు, సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారులు కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో కేంద్ర ఎన్నికల అధికారుల సమావేశం ఉంటుందని చెప్పారు. ఆ సమావేశం తరువాత ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. సెక్టోరల్ అధికారులు, బీఎల్ఓలు ఎన్నికల నియమావళికి సంబంధించి చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల ప్రక్రియలో బీఎల్ఓలు అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. సెక్టోరల్ అధికారులు క్షేత్రస్థాయిలో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పరిశీలించుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను మ్యాపింగ్ చేసుకుని కమ్యూనికేషన్ వ్యవస్థ, పోలీసులతో కలిసి శాంతిభద్రతలకు సంబంధించిన సౌకర్యాలు పరిశీలించాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక భద్రతకు నివేదికలు పంపాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఈవీఎంల వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు సుజన, మనోజ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అర్హులైన క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బాక్సింగ్, హాకీ, స్విమ్మింగ్, సెయిలింగ్ క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బాలాజీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పోర్ట్స్ కంపెనీ ఎంపిక ట్రయల్స్ నిర్వహించనున్నారు. శాప్ ఆదేశాల మేరకు బెంగళూరులోని స్పోర్ట్స్ గ్రౌండ్ ఎంఈజీ సెంటర్‌లో ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తారన్నారు. క్రీడాకారులు 05 ఫిబ్రవరి 2010 నుంచి 05 ఫిబ్రవరి 2016 మధ్య జన్మించినవారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 7013046094ను సంప్రదించాలన్నారు.

'నా భర్తను దారుణంగా కొట్టి చంపేశారు'

- పోలీసులకు విశ్రాంత ఆర్మీ ఉద్యోగి భార్య ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు



మృతి చెందిన మురళి(ఫైల్)

చౌడేపల్లె: 'నా భర్త చెక్కల మురళి(38)'ని ఆయన కుటుంబ సభ్యులే అతి దారుణంగా కొట్టి చంపేశారని మృతుడి భార్య సంపూర్ణమ్మ ఆరోపిస్తూ శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన చౌడేపల్లెలో వెలుగు చూసింది. వివరాలిలా.. చౌడేపల్లె టౌన్ నాయునివారిపాళ్యంకు చెందిన చెక్కల మురళి ఆర్మీలో విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందారు. పెద్దపంజాణి మండలం నెర్నిపల్లెకు చెందిన సంపూర్ణమ్మతో వివాహమైంది. అయితే వ్యక్తిగత కారణాలతో వారు వేర్వేరుగా నివసిస్తున్నారు. మురళి మద్యానికి బానిస కావడంతో కుటుంబంలో ఘర్షణలు తలెత్తాయి. ఈక్రమంలో తల్లిదండ్రుల వద్దనే మురళి నివాసం ఉండగా సంపూర్ణమ్మ తన పుట్టింటిలో నివాసం ఉంది. ఇంతలో ఏమి జరిగిందో కానీ మురళి మృతి చెందాడని అతని కుటుంబ సభ్యులు సంపూర్ణమ్మకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. మృతుడి శరీరం, గొంతు భాగంలో గాయాలను గుర్తించి మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ వాసు కేసు నమోదు చేసి శవాన్ని పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలంలో శనివారం ఎస్ఈబీ అధికారులు అక్రమమద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కాటప్పగారి పల్లి వద్ద జయరామయ్య(60) అనే వ్యక్తి నుంచి 65 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నలగంపల్లి క్రాస్ వద్ద శాంతి(45) అనే మహిళ నుంచి 35 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

రెజ్లింగ్ చాంపియన్లకు అభినందన



క్రీడాకారులతో రెజ్లింగ్ సంఘం సభ్యులు

నాయుడుపేట : రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులకు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ వారు అభినందనలు తెలిపారు. శనివారం నాయుడుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ బి.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 24, 25 తేదీల్లో కాకినాడలో నిర్వహించిన పోటీల్లో జిల్లా జట్టు ఉత్తమంగా రాణించి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుందన్నారు. మొత్తం 3 బంగారు, 5 రజతం, 4 కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. త్వరలోనే ఉత్తర ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొననున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రెజ్లింగ్ జిల్లా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రవిరెడ్డి, కార్యదర్శి దారా రవి, పీడీ హరినారాయణ పాల్గొన్నారు.